# సకల జనులూ.. బీఆర్ఎస్ వైపే..

- గులాబీ పార్టీ అభ్యర్థుల ప్రచారానికి ప్రజలు బ్రహ్మరథం
- స్వచ్ఛందంగా అభ్యర్థులకు మద్దతు ప్రకటిస్తున్న అన్ని వర్గాలు
- కలిసికట్టుగా ప్రచారంలోనే కొనసాగుతున్న నాయకులు
- గ్రేటర్‌లోని అన్ని నియోజకవర్గాల్లో పండుగ వాతావరణం

అసెంబ్లీ ఎన్నికల బరిలోకి కాలు దువ్వుతున్న పేరు మోసిన పార్టీలు ఇంకనూ అభ్యర్థుల ఖరారులో డక్కా ముక్కీలు తింటుండగా, ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను ప్రకటించి, ప్రచారంలో దూసుకుపోతోంది. అభివృద్ధిపై, రానున్న ఎన్నికలపై ఎలాంటి తడబాటు, తత్తరపాటు లేకుండా బీఆర్ఎస్ పార్టీ ముందడుగు వేస్తూ రేపటి అభివృద్ధిని కాంక్షిస్తూ నవోదయం దిశగా పయనిస్తున్నది.



సిటీబ్యూరో, అక్టోబర్ 18(నమస్తే తెలంగాణ): ఎన్నికల ప్రచారంలో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) దూకుడు కొనసాగుతున్నది. విపక్ష పార్టీలు అభ్యర్థుల ఖరారులోనే తడబాటు పడుతుంటే బీఆర్ఎస్ మాత్రం పార్టీ అభ్యర్థులకు బీ-ఫాంలను అందజేసి ప్రచారంలో తనదైన పంథాను చాటుకుంటోంది. గ్రేటర్ 24 నియోజకవర్గాల్లోని పాతబస్తీ మినహా ఇతర అన్ని నియోజకవర్గాల్లో గులాబీ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు, చైర్మన్లు, కార్పొరేటర్లు పార్టీ రాష్ట్ర నాయకులు అభ్యర్థులకు మద్దతుగా నిలుస్తూ ప్రచారాన్ని ఉద్ధృతం చేశారు. ఇంటింటి ప్రచారం, పాదయాత్రలు ఒకవైపు, మరోవైపు కలిసివచ్చే నేతలను పార్టీలోకి ఆహ్వానిస్తూ నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేస్తున్నారు. నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాలతో క్యాడర్‌లో నూతనోత్తేజాన్ని నింపుతూ అందరినీ ఏకతాటిపైకి తీసుకువచ్చి అభ్యర్థుల గెలుపునకు బాటలు సుగమమం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే పదేండ్ల అభివృద్ధి, ఇటీవల సీఎం కేసీఆర్ ప్రకటించిన ఎన్నికల మ్యానిఫెస్టో ప్రచార అస్త్రంగా కాలనీలు, బస్తీలు కలియతిరుగుతూ ప్రజలను ఆకట్టుకుంటున్నారు. ప్రధానంగా అన్ని వర్గాలు అభ్యర్థులకే మద్దతు అంటూ స్వచ్ఛంధంగా ముందుకు వస్తుండటం, ప్రచారానికి ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభిస్తున్న తీరు పట్ల పార్టీ అభ్యర్థుల గెలుపు నల్లేరు మీద నడకేనని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

### అటు పాదయాత్రలు, బూత్ లెవల్ సమీక్షలు

బీఆర్ఎస్ అభ్యర్థులు నియోజకవర్గంలో డివిజన్లవారీగా ఇంటింటి పాదయాత్రకు ప్లాన్ చేసుకుని ఆ దిశగా ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ప్రతి ఓటరుకు చేరువయ్యేలా బీఆర్ఎస్ అభ్యర్థులు క్యాంపెయిన్ నిర్వహిస్తున్నారు. చేసిన అభివృద్ధిని, సంక్షేమంతో బీఆర్ఎస్ ప్రకటించిన మ్యానిఫెస్టో వివరిస్తూ స్థానికులతో మమేకం అవుతున్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు 65 ఏండ్లు పాలించిన అభివృద్ధి జరగలేదని, గడిచిన పదేండ్లలోనే బీఆర్ఎస్ ప్రభుత్వం వందేండ్ల అభివృద్ధికి బాటలు వేసిందంటూ ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్తున్నారు. ఒకవైపు పాదయాత్రలు, మరో వైపు బూత్ లెవల్ ఏజెంట్లతో ప్రత్యేకంగా సమావేశమై భారీ మెజార్టీ లక్ష్యంగా అభ్యర్థులు ప్రచారంలో వేగాన్ని పెంచారు.

# మరోసారి అధికారం బీఆర్ఎస్‌దే..

- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



పద్మారావునగర్‌లో బీఆర్ఎస్ ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

బన్సీలాల్‌పేట్, అక్టోబర్ 18 : సీఎం కేసీఆర్ నాయకత్వంలో గడిచిన తొమ్మిదిన్నరేండ్లలో చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలే బీఆర్ఎస్‌ను మరోసారి అధికారంలోకి తీసుకువస్తాయని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సనత్‌నగర్ నియోజకవర్గంలోని పద్మారావునగర్‌లో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల కార్యాలయాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించారు. అంతకు ముందు హమాలిబస్తీ వద్ద ఉన్న డాక్టర్ బీఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి మంత్రి నివాళులర్పించారు. అక్కడి నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కలిసి బైక్ ర్యాలీ నిర్వహించి మంత్రికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ... సనత్‌నగర్ నియోజకవర్గంలో గత 50 ఏండ్లలో జరగని అభివృద్ధి, తెలంగాణ ఏర్పడ్డాక కోట్లాది రూపాయలు ఖర్చు చేసి సీఎం కేసీఆర్ సహకారంతో కేవలం తొమ్మిదిన్నర ఏండ్లలో చేశామన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, పేదల కోసం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించి వారి మద్దతు కోరాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బన్సీలాల్‌పేట్ కార్పొరేటర్ కే.హేమలత, బీఆర్ఎస్ ఇన్‌చార్జి జీ.పవన్‌కుమార్ గౌడ్, డివిజన్ అధ్యక్షుడు వెంకటేశన్ రాజు, కార్యదర్శులు మహేందర్, రాజేందర్, నాయకులు ఏసూరి మహేశ్వర రావు, శ్రీకాంత్‌రెడ్డి, వెంకటరమణ, సురేశ్, ముక్క శ్రీను, హరిచారి, సుధాకర్ రెడ్డి, కుశాల్, జగ్గయ్య, బాబురావు, గజ్జెల శ్రీను, అమృత, అంబిక, దుర్గ, కౌసల్య, లావణ్య, నాగలక్ష్మి, ఫహీమ్, రజాక్, శరీఫ్, అబ్బాస్ పాల్గొన్నారు.

## మల్కాజిగిరి నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థిగా మర్రి రాజశేఖర్ రెడ్డి

| | |
|---|---|
| పేరు | : మర్రి రాజశేఖర్ రెడ్డి |
| జీవిత భాగస్వామి | : మమతారెడ్డి |
| పిల్లలు | : అనుశ్రేయా రెడ్డి, ధీరెన్ రెడ్డి |
| తల్లిదండ్రులు | : లక్ష్మణ్ రెడ్డి, తల్లి అరుంధతి రెడ్డి |
| ఉద్యమ చరిత్ర | : ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారు. |



**సామాజిక నేపథ్యం :** సికింద్రాబాద్, బోయిన్‌పల్లికి చెందిన మర్రి రాజశేఖర్ రెడ్డి తండ్రి లక్ష్మణ్ రెడ్డిని స్ఫూర్తిగా తీసుకుని..సమాజంలో మార్పు తీసుకురావడానికి విద్యతోనే సాధ్యమని గుర్తించి విద్యాసంస్థలు నిర్వహిస్తున్నారు.

**రాజకీయ ప్రస్థానం :** ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి పనులను చూసి రాజకీయాలకు ఆకర్షితుడై పార్టీలో చేరారు. 2019లో మల్కాజిగిరి పార్లమెంట్‌కు పోటీ చేసి స్వల్ప తేడాతో ఓటమిపాలయ్యారు. ప్రస్తుతం కంటోన్మెంట్ నియోజకవర్గం, మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జిగా ఉన్నారు. బీఆర్ఎస్ పార్టీ అనుబంధ సంస్థలకు గౌరవ అధ్యక్షులుగా ఉన్నారు.

**విద్యార్హతలు :** బీకాం

**వృత్తి :** విద్యాసంస్థలు

**సేవా కార్యక్రమాలు :** రాష్ట్రంలో చేతి వృత్తుల జీవన విధానం స్థితిగతులపై 'సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్' అనే ప్రభుత్వ సంస్థ సహకారంతో సొంత ఖర్చులతో అధ్యయనం చేయించి వారి అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారు.

**కలిసొచ్చే అంశాలు :** ఇప్పటికే ప్రజలతో మేమకమై ఉన్నారు. తన స్వచ్ఛంద సంస్థల ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల్లో ఉన్నారు.



రహత్‌నగర్‌లో ముస్లింల మద్దతు కోరుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

## ఇంటింటికీ వెళ్లి.. ఆత్మీయంగా పలుకరిస్తూ..

అంబర్‌పేట, అక్టోబర్ 18 : నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని రహత్‌నగర్, వినాయకనగర్ బస్తీల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డివిజన్ కార్పొరేటర్ బి.పద్మావెంకట్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు సీహెచ్ చంద్రమోహన్‌లతో కలిసి ఆయా బస్తీల్లో ఇంటింటికి వెళ్లి ప్రజలను ఆత్మీయంగా పలుకరించి.. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని తెలిపి, ఇటీవల సీఎం కేసీఆర్ ప్రకటించిన మ్యానిఫెస్టోను కూడా చెప్పారు. కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ ప్రచారం కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌కు ఓటు అడిగే హక్కులేదు

ముషీరాబాద్, అక్టోబర్ 18: అధికారంలో ఉన్నప్పుడు ముషీరాబాద్ నియోజకవర్గాన్ని విస్మరించిన కాంగ్రెస్‌కు ఓట్లు అడిగే హక్కులేదని బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ఎన్నికలప్పుడు సుట్టపు చూపుగా వచ్చే నాయకుల మాటలు నమ్మవద్దని ప్రజలకు సూచించారు. నిత్యం ప్రజల మధ్య ఉంటూ.. వందల కోట్లతో అభివృద్ధి పనులు చేసిన తనకు అండగా నిలవాలని కోరారు. బుధవారం రాంనగర్‌లో జరిగిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎం కేసీఆర్ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలతో పాటు అదనంగా కొత్త పథకాలు అమలు చేసి పేదలకు ఆదుకున్నారని తెలిపారు. మ్యానిఫెస్టోలో ఆరోగ్య శ్రీ పథకం పరిధిని 15 లక్షలకు పెంచడం, వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, వితంతువులకు పెన్షన్ భారీగా పెంపు నిర్ణయాన్ని అన్ని వర్గాలు స్వాగతిస్తున్నాయన్నారు. డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాన్ని కొనసాగించడంతోపాటు నిరుపేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు కట్టుకోవడానికి ఆర్థిక సహాయం ప్రకటించారని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్



బీఆర్ఎస్ పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్

## మరోసారి దీవించండి

- ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్.. బీఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు

వ్యవసాయ యూనివర్సిటీ, అక్టోబర్ 18 : నియోజకవర్గ ప్రజలు తాను చేసిన అభివృద్ధిని చూసి మరోసారి దీవించాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ అన్నారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసే బీఆర్ఎస్‌లో ఇతర పార్టీల నాయకులు చేరుతున్నారని తెలిపారు. బుధవారం ఆయన నివాసంలో నియోజకవర్గంలోని సులేమాన్ నగర్, ఎం,ఎం ఫహాడీ, శాస్త్రిపురం డివిజన్ల నుంచి దాదాపు 100 మంది ముస్లిం నాయకులు వివిధ పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రజల ఆశీస్సులతో మరోసారి గెలిచి, తనపై నమ్మకంతో సీటు కేటాయించిన సీఎం కేసీఆర్‌గారికి కానుకగా ఇస్తానన్నారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన అనేక సంక్షేమపథకాలు ఎమ్మెల్యే గారిని మరోసారి గెలిపిస్థాయని స్థానిక నాయకులు గౌస్ ఆశాభావం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ చేపట్టిన అనేక సంక్షేమ పథకాలు మస్లింలకు చేరుతున్నాయన్నారు. సులేమాన్ నగర్ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు ఎండీ గౌస్ , అధ్యక్షుడు షేక్ నయిమొద్దీన్, ఎండీ ఇస్మాయిల్, అక్బర్, జీషాన్, తయార్, రూఫ్, శాస్త్రీపురం డివిజన్ ఖాన్ ఆధ్వర్యంలో ముస్లిం నాయకులు పెద్ద ఎత్తున పార్టీలో చేరారు.